# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- హాలియాలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ
- అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

హాలియా, జూలై 19 : విద్య, వైద్య శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు ప్రజలు మెరుగైన సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ నారాయణ రెడ్డి హెచ్చరించారు. హాలియాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని సిబ్బంది హాజరు రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు, వార్డు, ల్యాబ్‌ను పరిశీలించారు. ముందస్తు అనుమతి, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌ను సస్పెండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారితోపాటు ఉప ఆరోగ్య కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. రోజువారీగా వస్తున్న ఔట్ పేషెంట్లు, గర్భిణుల నమోదు, ప్రసవాలు, మాతా శిశు సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎవరైనా వ్యాధులకు గురైతే తక్షణమే వైద్యసేవలు అందించేలా చూడాలని ఆదేశించారు. ఆశ, ఏఎన్ఎంలు బాగా పనిచేయాలని, ప్రతి గ్రామాన్ని తిరుగాలని తెలిపారు. అనంతరం హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పాఠశాలలోని పదో తరగతి క్లాస్ రూమ్‌కు వెళ్లి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ చదివించారు. అందరికీ రెండు జతల యూనిఫామ్ వచ్చాయా, పాఠ్యపుస్తకాలు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి రామకృష్ణ, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ శైలజ తదితరులున్నారు.



హుజూర్‌నగర్‌లో అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## సాగర్ ఎడమ కాల్వ లైనింగ్ పనులు వేగవంతం చేయాలి

- అధికారులు సమయపాలన పాటించాలి
- పలు శాఖ అధికారులతో సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సమీక్ష

హుజూర్‌నగర్, జూలై 19 : వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నీటి విడుదల సమయం దగ్గర పడుతున్నందున నాగార్జునసాగర్ ఎడమ కాల్వ లైనింగ్ పనులు వేగవంతం చేయాలి సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు నెల చివర వరకు ఎడమ కాల్వ లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. మున్సిపాలిటీల్లో విష జ్వరాలు ప్రబలుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి అధికారులు సమయ పాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేసి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ నరసింహారావు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిధర్ , డీఈలు రవికాంత్, భిక్షం, రఘు, స్వామి, అమరేందర్, మేనేజర్ యాకూబ్ పాషా పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మత్స్యశాఖ అధికారి

- చేపలు పట్టుకునేందుకు మత్స్యకారుల నుంచి లంచం డిమాండ్
- 2016లోనూ ఏసీబీకి పట్టుబడిన రూపేందర్‌సింగ్

సూర్యాపేట అర్బన్, జూలై 19 : సూర్యాపేట జిల్లా మత్స్య శాఖ అధికారిగా రూపేందర్ సింగ్ ఏసీబీకి చిక్కాడు. చేపలు పట్టేందుకు పర్మిషన్ కోసం మత్స్యకారుల నుంచి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని ఒక మత్స్య సహకార సంఘం సభ్యులు వారి చెరువులో చేపలు పట్టుకునేందుకు అనుమతి కోరగా, రూపేందర్ సింగ్ రూ.25 వేలు డిమాండ్ చేశాడు. దాంతో మత్స్యకారులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచనల మేరకు శుక్రవారం ఉదయం ఆయన ఇంట్లోనే రూ.25 వేలు అప్పజెప్పే క్రమంలో రూపేందర్‌సింగ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ అధికారి 2016లో నిజామాబాద్ జిల్లాలో పని చేస్తున్న సమయంలోనూ మత్స్యకారుల నుంచి రూ.5 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆ కేసు కోర్టులో ఉంది. ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. లంచం లేనిదే ఏ పనీ చేయడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. మరో వైపు రూపేందర్ సింగ్ మత్స్య శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ హోదాలో కొనసాగాల్సి ఉన్నా.. కొంతమంది పైఅధికారుల అండతో గతంలో గద్వాల్ జిల్లా అధికారి హోదా దక్కించుకున్నారు. అక్కడ అవినీతి ఆరోపణలు రావడంతో సూర్యాపేట జిల్లాకు బదిలీపై వచ్చారు.



ఏసీబీకి పట్టుబడ్డ సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్

# రుణమాఫీపై స్పష్టతేది?

## లబ్ధిదారుల ఎంపిక ప్రతిపాదికపై మౌనం

- తొలి జాబితాలో రేషన్‌కార్డే ప్రమాణికం
- డీసీసీబీ పరిధిలో అర్హుల్లో 46శాతం మందికే రుణమాఫీ
- బ్యాంకుల్లో లబ్ధిదారుల జాబితాలే లేని వైనం
- జాబితాలపై స్పష్టత లేక బ్యాంకుల వద్ద రైతుల పరుగులు
- కేసీఆర్ సర్కార్ ఇచ్చిన దాంట్లో 43శాతమే రుణమాఫీ
- ఆర్థిక భారం తగ్గించుకునేందుకు నానా తంటాలు
- రైతుల్లో చర్చనీయాంశంగా రుణమాఫీ కోతలు

అధికారంలోకి వస్తే తక్షణమే అప్పు ఉన్న ప్రతి రైతుకూ రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ... ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల అనంతరం కూడా రైతులకు కుచ్చుటోపీ పెట్టేందుకు కుట్రలు చేస్తున్నట్లు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. గురువారం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించినా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అసలైన రైతుల్లో లబ్ధి జరిగిన రైతులు మాత్రం సగానికి తక్కువే ఉండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసలు రుణమాఫీకి దేన్ని ప్రతిపాదికగా తీసుకున్నారన్న దానిపై శుక్రవారం కూడా ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోయారు. అటు వ్యవసాయ అధికారులు, ఇటు లీడ్ బ్యాంకు ప్రతినిధులు సైతం తమకేమీ తెలువదు.. అంతా ఉన్నతాధికారులకే తెలుసంటూ తప్పించుకుంటుండడం ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తున్నది. కాగా అర్హులైన రైతుల్లో 50శాతానికి కూడా తక్కువగానే రుణమాఫీ వర్తింపచేస్తున్నట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో కేసీఆర్ సర్కార్ చేసిన లబ్ధితో పోల్చినా ప్రస్తుతం రూ.లక్ష వరకు రుణమాఫీ లబ్ధి 43శాతానికే పరిమితం అవుతుండడం గమనార్హం.

– నల్లగొండ ప్రతినిధి, జూలై19(నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రుణమాఫీ పథకంపై స్పష్టత కరువైంది. లబ్ధిదారుల ఎంపికకు తీసుకున్న ప్రమాణాలు ఏమిటన్న దానికి ఎక్కడా సమాధానం దొరుకడం లేదు. బ్యాంకుల వద్ద లబ్ధిదారుల జాబితానే లేకపోగా ఎంత మందికి మాఫీ అయ్యిందనేది కూడా చెప్పే నాథుడే లేకుండా పోయారు. దీంతో రైతులు శుక్రవారం ఆయా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తమ లోన్ ఖాతా నంబర్‌తో వచ్చి రుణమాఫీ వచ్చిందా లేదా అని చెక్ చేసుకోవడం కనిపించింది. వస్తే వచ్చిందని, లేకుంటే ఎందుకు రాలేదన్న దానికి ఎవరూ బదులివ్వలేదు. వ్యవసాయ అధికారులను అడగండి అంటూ బ్యాంకర్లు ఉచిత సలహా ఇస్తుండడం విశేషం. దాంతో రైతులు బ్యాంకుల నుంచి వ్యవసాయ అధికారుల వద్దకు బారులు తీరారు. వడ్డీ, అసలు కలిపినా రూ.లక్ష లోపే రుణం ఉన్నా చాలా మందికి రుణమాఫీ జరుగకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.



భువనగిరిలోని యూనియన్ బ్యాంక్ వద్ద రుణమాఫీ లిస్ట్‌లో తమ పేరు ఉందో, లేదో చూసుకుంటున్న రైతులు

### సహకారం రంగంలో 46శాతం మందికే..

పంట రుణాల మంజూరులో సహకార రంగం పాత్ర కూడా కీలకమే. గ్రామీణ ప్రాంతాల రైతులకు రుణాలివ్వడంలో కోఆపరేటివ్ సొసైటీలు ముందు వరుసలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్లగొండ జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు(డీసీసీబీ) ఆధ్వర్యంలో రైతులకు పెద్ద మొత్తంలో పంట రుణాలు ఇచ్చారు. ఇందులో రూ.లక్ష వరకు రుణాలు పొందిన వారిలో రూ.లక్ష రుణమాఫీకి అర్హులైన వారుగా 72వేల మందిని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వీరికి రూ.316 కోట్ల రుణాలు మాఫీ అవుతాయని గుర్తించారు. తీరా గురువారం ప్రకటించిన రుణమాఫీ జాబితా ప్రకారం అర్హులైన వారిలో కేవలం 46శాతం మందికే రుణమాఫీ వర్తిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. డీసీసీబీ అధికారుల లెక్కల ప్రకారం 33,913 మందికే రూ.143.11 కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. మిగతా 54శాతం మంది రైతుల పరిస్థితి ఏంటో అన్న దానికి శుక్రవారం నాటికి ఎవరి వద్దా సమాధానం లభించలేదు.

### కుటుంబం ప్రాతిపదికనే..

ఇదే విషయమై రైతు సంఘాల నేతలు రంగంలోకి దిగి ఆరా తీసే పనిలో పడ్డారు. పలువురి రైతులు ఇచ్చిన సమాచారంతో పాటు రుణమాఫీ జాబితాల ప్రకారం ఓ అంచనాకు వచ్చారు. గురువారం నాటి రుణమాఫీలో రేషన్‌కార్డు ప్రతిపాదికన కుటుంబాన్ని పరిగణలోకి తీసుకునే వర్తింప చేసినట్లు తేలింది. ఒకే రేషన్‌కార్డు పరిధిలోని కుటుంబసభ్యుల్లో ఇద్దరికి కలిపి తీసుకున్న అసలు, వడ్డీ కలిపి ఉంటే వారి రుణం మాఫీ అయినట్లు తెలిసింది. ఇదే సమయంలో వీరిద్దరి రుణం రూ.లక్ష దాటితే ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు. వీరికి రూ.లక్షన్నర వరకు రుణమాఫీ ప్రకటించినప్పుడు మాఫీ జరుగుతుందని తెలుస్తున్నది. ఇలానే రేషన్‌కార్డులోని కుటుంబసభ్యులకు ఎంత మందికి రుణాలు ఉన్నా గరిష్ఠంగా ఆ కుటుంబానికి 2లక్షల వరకే రుణమాఫీ వర్తింప చేయనున్నట్లు తొలి జాబితాలోని లబ్ధిదారుల ఎంపిక స్పష్టం చేస్తున్నది. ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక, వారు తీసుకున్న రుణాలను బట్టి రేషన్‌కార్డు బేస్డ్‌గా కుటుంబాన్నే ప్రామాణికంగా తీసుకున్నట్లు అర్థమవుతున్నది. ఒక కుటుంబంలో ఎంత మందికి ఎంత అప్పు ఉన్నా అందరికీ కలిపి గరిష్ఠంగా రూ.రెండు లక్షల వరకే రుణమాఫీ వర్తింప చేసేలా ప్రభుత్వం అనధికారిక ఆదేశాలిచ్చినట్లు తెలుస్తున్నది. దీని వల్ల ఆర్థికంగా భారీగా ప్రభుత్వం భారం తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అనధికారిక వర్గాల సమాచారం. పట్టాదారు పాస్‌పుస్తకాల ఆధారంగా రుణమాఫీ చేపడితే భారీ మొత్తంలో భరించాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం తెరవెనక కోతలకు సిద్ధమైందన్న చర్చ సర్వత్రా మొదలైంది.

### రుణ మాఫీలో తేడాలు

| | ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో (రూ.లక్ష వరకు) | | బీఆర్ఎస్ హయాంలో (రూ.99,999వరకు) | |
|---|---|---|---|---|
| జిల్లా | రైతుల సంఖ్య | రూ.కోట్లలో | రైతుల సంఖ్య | రూ.కోట్లలో |
| నల్లగొండ | 83,124 | 454.49 | 1,65,300 | 1044.02 |
| సూర్యాపేట | 56,274 | 282.98 | 1,75,492 | 751.00 |
| యాదాద్రి | 37,285 | 203.82 | 59,726 | 364.75 |
| మొత్తం | 1,76,683 | 941.29 | 4,00,518 | 2159.77 |

### అప్పట్లో ఇచ్చిన దాంట్లో 43 శాతమే

2014 జూన్ 2 నుంచి 2018 డిసెంబర్11 వరకు రైతులు తీసుకున్న పంట రుణాల్లో రూ.లక్ష రుణమాఫీని కేసీఆర్ సర్కార్ 2018 నవంబర్ ఎన్నికల సందర్భంగా ప్రకటించింది. దాని ప్రకారం 2019 ఫిబ్రవరిలో ఒకసారి, కరోనా తర్వాత 2023 ఆగస్టులో మూడు దఫాలుగా 99,999 రూపాయల వరకు గల రుణాలను మాఫీ చేసింది. రూ.లక్ష రుణాల మాఫీకి ఇంతలోనే ఎన్నికల కోడ్ అడ్డమొచ్చింది. కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీ లబ్ధిని పరిశీలిస్తే నల్లగొండలో 1.65లక్షల రైతులకు రూ.1,044కోట్లు, సూర్యాపేటలో 1.75లక్షల మందికి రూ.751 కోట్లు, యాదాద్రిలో 59,726 మంది రైతులకు రూ.364 కోట్లుగా ఉంది. మొత్తంగా 4లక్షల మంది రైతులకు రూ.2159కోట్లు రుణమాఫీ జరిగింది. ఇది 99,999 రూపాయల వరకే కావడం విశేషం. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ లక్ష రూపాయల వరకు రుణమాఫీ ప్రకటిస్తే నల్లగొండలో 83,124 మందికి రూ.454.49కోట్లు, సూర్యాపేటలో 56,274 మందికి రూ.282.98కోట్లు, యాదాద్రి జిల్లాలో 37,285 మందికి రూ.203.82 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. మొత్తంగా 1,76,683 మందికి రూ.941.29కోట్లు మాత్రమే లబ్ధి జరుగుతున్నది. దీన్ని బట్టి కేసీఆర్ సర్కార్ ఇచ్చిన దాంట్లో 43శాతమే రుణమాఫీ జరుగుతున్నట్లు స్పష్టమవుతున్నది. అప్పుడు కేసీఆర్ పాసుపుస్తకం ప్రతిపాదికన రుణమాఫీ వర్తింప చేయడంతో భారీగా రైతులకు లబ్ధి చేకూరగా ప్రస్తుతం రేషన్‌కార్డు ప్రతిపాదికగా కుటుంబం యూనిట్‌గా తీసుకోవడంతోనే రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు లెక్కలను బట్టి వెల్లడవుతున్నది. దీనిపై అధికారికంగా మరింత స్పష్టత రావాల్సి ఉంది.

### క్షేత్రస్థాయిలో ఇలా..

ఉమ్మడి జిల్లా పరిధిలో మచ్చుకు కొన్ని సొసైటీల్లో జరిగిన లబ్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే విస్మయకర విషయాలు వెలుగుచూశాయి. దామరచర్ల సొసైటీలో రూ.లక్ష లోపు రుణాలున్న రైతులు 518కాగా వీరిలో 360 మందికే రుణమాఫీ వచ్చింది. ఇక్కడ పాసుపుస్తకం ప్రమాణికం కాకుండా రేషన్‌కార్డు ప్రమాణింగా ఎంపిక చేసినట్లు స్పష్టమైంది. డిండి పరిధిలో 774 మందికి గానూ 320 మందికి, పెద్దవూరలో 408 మందికిగానూ 92 మందికి.. కొండమల్లేపల్లిలో 771 మందికిగానూ 423 మందికి.. నకిరేకల్‌లో 432 మందికిగానూ 207 మందికి, కట్టంగూరులో 931 మందికిగానూ 389 మందికి, శాలిగౌరారంలో 270 మందికిగానూ 97 మందికి, కనగల్‌లోని రెండు సొసైటీల్లో కలిపి 994 మందికిగానూ 355 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది.

- యాదాద్రి జిల్లాలోని ఆత్మకూర్(ఎం) సొసైటీలో 566 మందికి గానూ 239 మందికి, చౌటుప్పల్‌లో 283 మందికిగానూ 147 మందికి, తుర్కపల్లిలో 822 మందికిగానూ 495 మందికి లక్ష లోపు రుణాలు మాఫీ అయ్యాయి.
- సూర్యాపేట జిల్లా పరిధిలోని నేరేడుచర్ల పరిధిలోని మూడు సొసైటీల్లో కలిపి 1790 మంది రూ.లక్ష వరకు రుణగ్రహీతలు ఉండగా ఇందులో 797 మందికే మాఫీ జరిగి, మరో 993 మందికి కాలేదు. మఠంపల్లి సొసైటీలో 749 మందికిగానూ 367 మందికి, హుజూర్‌నగర్‌లోని అమరవరంలో 631 మందికి గానూ 261 మందికి, వేపలసింగారంలో 555 మందికి గానూ 217 మందికి, బూరుగడ్డలో 1092 మందికి గానూ 488 మందికి మాత్రమే లబ్ధి జరిగినట్లు తెలిసింది. మిగతా వాళ్ల సంగతి ఏంటో ఎవరి వద్దా సమాధానం దొరుకలేదు.

### రుణమాఫీ మెసేజ్ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

- సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో ఇదే అదునుగా సైబర్ నేరస్తులు వివిధ బ్యాంకు లోగోస్ వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోలు పెట్టి రైతు రుణమాఫీ అంటూ ఏపీకే ఫైల్స్ వంటి లింకులను పంపుతున్నారని, వాటిని ఓపెన్ చేయొద్దని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాప్‌ల పేరుతో మెసేజ్‌లు పెట్టి ఓటీపీలు అడిగి రైతుల అకౌంట్‌లో డబ్బులు కాజేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. వ్యక్తి గత సమాచారాన్ని అనుమానితులకు తెలుపకుండా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్1930కు కాల్ చేయాలని, www.cybercrime.gov.inలో రిపోర్టు చేయడం లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

# పట్టించుకునేవారు లేక గురుకులాల్లో చావు కేక

- వరుస మరణాలతో భయాందోళనలు
- ఆరు నెలల్లో నలుగురు విద్యార్థుల మరణం..
- తాజాగా దోసపహాడ్‌లో విద్యార్థిని
- సర్కారు నిర్లక్ష్యం, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడమే కారణం?
- వసతిగృహాల్లో కేర్ టేకర్లు అవసరం



ఈ నెల 16 న దోసపాడు గురుకుల విద్యార్థిని సరస్వతి మృతితో సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సూర్యాపేట, జూలై 19 (నమస్తే తెలంగాణ) : జూలై 3న.. ఆత్మకూర్.ఎస్ మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏడో తరగతి విద్యార్థి అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. హాస్టల్ నిర్వాహకులు మొదట పాముకాటు అన్నారు. తర్వాత అస్వస్థత అని మాట మార్చారు. వాస్తవానికి రాత్రి భోజనం చేసే సమయంలో అన్నం మెతుకులు గొంతులో ఇరుక్కున్న కారణంగా చనిపోయినట్లు పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలింది. అదే సమయంలో ఎవరైనా పట్టించుకుని నోరు కడిగించి, అందుకు సంబంధించిన ఒక టాబ్లెట్ వేసి ఉంటే బాబు బతికేవాడని వైద్యులు చెప్తున్నారు.

ఈ నెల 16న.. పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని సరస్వతి చనిపోయింది. సోమవారం రాత్రి 102 డిగ్రీల జ్వరంతో బాలిక ఇబ్బంది పడుతుంటే ఒక మందు గోలి వేసి తగ్గుతుందిలే అని వదిలేయడంతో పిట్స్‌కు దారితీసింది. తెల్లవారే సరికి పరిస్థితి విషమించడంతో అప్పుడు పరుగుపరుగున ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. సరస్వతి చనిపోయింది.

ఇటీవల బాలెంల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల్లో సమస్యలు పరిష్కరించాలని, తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థినులు వారం పాటు ఆందోళనకు దిగడం తెలిసిందే. ఈ వరుస ఘటనలన్నీ గురుకులాలపై సర్కారు నిర్లక్ష్యాన్ని, అధికారుల పర్యవేక్షణలోపాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. చదువు కోసం సర్కారు బడికి వచ్చిన పేదింట బిడ్డలను బలపీఠం ఎక్కిస్తున్నాయి. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలిస్తున్నాయి. మరోవైపు ఇలాంటి ఘటనలతో మిగతా విద్యార్థులు సైతం భయాందోళనకు గురవుతుండడం బాధాకరం.

సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఎప్పుడు ఏ పాఠశాలలో ఎలాంటి సంఘటన జరుగుతుందోననే భయానక పరిస్థితి నెలకొంది. గురుకుల విద్యా సంస్థల్లో ఆరు నెలల కాలంలో నలుగురు చనిపోవడమే తీవ్రతను చెప్తున్నది. ఇటీవల బాలెం సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ కళాశాలలో జరిగిన రచ్చ అంతాఇంతా కాదు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమే విమర్శలు వెల్లువెత్తున్నాయి. హాస్టళ్లలో విద్యార్థులను కనీసం పట్టించుకోవడం లేదని, సుస్తీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తున్నది. వందలాది విద్యార్థులు ఉండే హాస్టళ్లు, గురుకులాల్లో రాత్రి విధుల్లో ఒక టీచర్ మాత్రమే ఉంటుండగా. కేర్ టేకర్లు ఎక్కడా లేకపోవడం గమనార్హం. పిల్లలను ప్రైవేట్‌లో చదివించే స్థోమత లేక సర్కారు విద్యా సంస్థల్లో పరీక్ష రాయించి మరీ చేర్పిస్తుంటే తమ బిడ్డలను శవాలుగా అప్పగిస్తున్నారని బాధిత తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం, ముఖ్యమంత్రి దగ్గరే ఆ శాఖ ఉన్నా అధికారులపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

### కలిచి వేస్తున్న విద్యార్థుల మరణాలు..

జిల్లాలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో జరుగుతున్న ఘటనలు అందరినీ కలచి వేస్తున్నాయి. ఐదు నెలల క్రితం సూర్యాపేట మండలం ఇమాంపేటలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోగా, మిగిలిన విద్యార్థినులు హాస్టల్‌లో ఉండేందు చాలా భయపడ్డారు. దాంతో వారంపాటు సెలవులు ప్రకటించిన అధికారులు.. అనంతరం జిల్లాలో అక్కడకక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది కొద్దిరోజులు మాత్రమే కొనసాగగా, ఆ తర్వాత వదిలేశారు. ఆ తర్వాత గత నెలలో ఆత్మకూర్.ఎస్‌లో ఏడో తరగతి విద్యార్థి చనిపోవడం తెలిసిందే. తాజాగా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గురుకులంలో మరో విద్యార్థిని మరణం. ఇదే క్రమంలో ఇటీవల బాలెంల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వారంపాటు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. హాస్టల్‌లో సమస్యలు పేరుకుపోయాయని, మెనూ సరిగ్గా పాటించడం లేదని, సమస్యలపై ప్రశ్నిస్తే టీసీ ఇచ్చి ఇంటికి పంపుతామని ప్రిన్సిపాల్ బెదిరిస్తున్నారని నిరసనలకు దిగారు. విద్యార్థినుల పోరాటం అధికారులు ప్రిన్సిపాల్‌ను అక్కడి నుంచి బదిలీ చేశారు. ఇలాంటి ఘటనలు జరిపినప్పుడు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగితే తప్ప ప్రభుత్వం, అధికారుల నుంచి పట్టింపు ఉండడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఈ మరణాలను ఆపే దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులను పర్యవేక్షించేందుకు కేర్ టేకర్‌ను నియమించడం ద్వారా ఈ సమస్యలకు కొంతమేర పరిష్కారం దొరుకుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

## లక్ష రుణం వారి జాబితా బయట పెట్టాలి

- గతంలో 1,046 కోట్లు ఇస్తే.. ఇప్పుడు రూ.947 కోట్లు ఇవ్వడమేంటి?
- జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19: లక్ష రూపాయల రుణం తీసుకున్న రైతులకు తొలి విడుత మాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జాబితాను బయట పెట్టాలని నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు మాఫీ చేస్తామని ప్రతి రైతుకు రూ.99,999 వరకు అమలు చేసిన తర్వాత ఎన్నికల కోడ్ వచ్చిందని.. అప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1.65 లక్షల మంది రైతులకు రూ.1,045 కోట్లు మాఫీ అయ్యాయని తెలిపారు. మరి ఇప్పుడు 1.76 లక్షల మందికి లక్ష మాఫీ చేస్తే రూ.945 కోట్లు మాత్రమే ఎందుకు మాఫీ అవుతాయని ప్రశ్నించారు. ఎంతమందికి ఎంత రుణమాఫీ చేశారు, మిగతా వారిని ఏ కారణాలతో పక్కకు పెట్టారు? వాటి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు బంధును పక్కన పెట్టి ఆ డబ్బును రుణమాఫీకి ఇవ్వడం సరికాదన్నారు. రైతు రుణమాఫీని అమలు చేశామంటూ హరీశ్ రావును రాజీనామా చేయమనడం అర్థం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 అంశాలు అమలు చేస్తే ఆయన రాజీనామా చేస్తారన్నారు. హరీశ్‌రావు రాజీనామాకు సవాల్ విసిరితే సీఎం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు రాజీనామాలు కొత్త కాదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులను రెచ్చగొట్టి నోటిఫికేషన్లు రాకుండా కోర్టులు ఎక్కించిన కాంగ్రెస్ నేడు వారినే నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జునరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు మాలె శరణ్యారెడ్డి పాల్గొన్నారు.

## మట్టపల్లి నృసింహుడి సన్నిధిలో పుదుచ్చేరి హోంమంత్రి



పుదుచ్చేరి హోంమంత్రి నమశివాయమ్‌కు శేష వస్త్రం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మఠంపల్లి, జూలై 19 : మఠంపల్లి మండలంలోని మట్టపల్లి ఆలయాన్ని పుదుచ్చేరి హోంమంత్రి ఎ.నమశివాయమ్ సందర్శించారు. శుక్రవారం ఉదయం లక్ష్మీనరసింహ స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. స్వామివారి శేషవస్త్రాన్ని బహూకరించారు.

## రెండో రోజు డీఎస్సీ పరీక్షకు 231 మంది హాజరు

రామగిరి, జూలై 19 : నల్లగొండ ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో రెండో రోజు శుక్రవారం డీఎస్సీ పరీక్ష సజావుగా జరిగింది. ఎస్‌జీటీ విభాగంలో 244 మంది అభ్యర్థులకు 231మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం పరిశీలకుడు ఆర్.రామచంద్రయ్య తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు 5వరకు కొనసాగనున్నాయి.